

పాలడుగు వెంకటేశ్వరరావు

జీ.వో.ఎం.ఎస్. నంబరు 'నో అండ్ నో' ప్రకారము ఏడురోజులపాటు సెలవు వుపయోగించుకొని సుబ్బారావు ఆరోజే ఆఫీసులో అడుగు పెట్టాడు.

మూలను కూర్చుని ఏవో విషయాలు ముచ్చటించుకుంటూ వున్న ముని రత్నమూ, మాధవరావూ అతన్ని చూసి ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

రాజారావు వచ్చి పరిశీలనగా చూస్తూ సుబ్బారావు ప్రక్కనే కూర్చున్నాడు.

"ఎట్లా వుంది, ఇప్పుడు ?"

"ఏమిటి అట్లా అడుగుతున్నావు ? నా కేమయిందని ?"

రాజారావు ఒక క్షణంపాటు ఆశ్చర్యపోయాడు. వెంటనే సర్దుకుని, "ఆ సంగతి ఆఫీసు అందరికీ తెలిసిపోయిందిలే. ఇప్పుడు మామూలు మనిషివి అయినావా ?" అన్నాడు.

సుబ్బారావుకు నవ్వొచ్చింది.

"ఆరోజే మామూలుగా నడిచి ఇంటికి వెళ్ళాడు."

"అహాఁ, బాగా నొప్పిగా వుందా ?"– అన్నాడు సుబ్బారావు.

"ఉహూఁ, ఏ మాత్రమూ లేదు చెప్పానుగదా! మూడు నిముషాలలో అయిపోయింది. మామూలుగా నడిచి ఇంటికి వెళ్ళిపోయాను."

"కాని, అక్కడ ఇంజక్షనిస్తారట గదా! నొప్పి వెయ్యలేదూ ?"

"మామూలుగా ఎప్పుడో అప్పుడు అందరమూ ఇంజక్షన్లు తీసుకున్నవాళ్ళమే గదా! ఇప్పుడూ అంతే, అంతకంటే మరేం లేదు."

"ఏమయినా, నువ్వు చాలా ధైర్యం చేశావోయి."

"అందులో ధైర్యమేముంది? నేనేమిటో, నా సంపాదన ఏమిటో నాకు తెలుసు. బరువు సంగతి మోసేవాడికి గదా తెలిసేది. కనకనే ఆ సంగతిని గురించి, బాగా ఆలోచించి నేనే నిర్ణయించుకున్నాను."

ఆఫీసరుగారి ప్యూను వచ్చి సుబ్బారావుని రమ్మంటున్నారని చెప్పేడు.

"ఎందుకు పిలిచేడంటావు?" కంగారు నణుచుకుంటూ అడిగేడు సుబ్బారావు.

"ఆయన సంగతి నీకు తెలుసుగా! ఆయన అసలే చండప్రచండుడు. ఇట్లాంటి విషయాలు ఆయనకి నచ్చవు. నీకూ తెలుసుగా, యాభయ్యో ఏట మొన్ననే ఆయనకి ఎనిమిదో సంతానం కలిగింది. ఇంట్లాంటిపన్లు చెయ్యటం భగవంతునికి అపచారం చెయ్యటమేనని ఆయనకి నమ్మకం. నీ లీవు కాగితం ఇంతవరకూ బయటికి రాలేదు. ధైర్యంగా వుండు; ఆయన ఏమన్నా మాట్లాడకు. సమాధానం చెబితే ఆయన అసలే మండి పడతాడు;" రాజారావు వెనుకనుంచి హెచ్చరిక చేశాడు.

గుండెలు అతివేగంగా కొట్టుకుంటూ వుండగా తడబడుతూ ఆఫీసరు గదివైపు అడుగులు వేశాడు సుబ్బారావు.

మునిరత్నమూ, మాధవరావూ అతన్ని చూసి కిసుక్కున నవ్వారు. కనకారావు కునుకు ఆపుకుంటూ కాగితాలతో కుస్తీ పడుతున్నాడు. రాజారావు పిరికిమందు పోసి, వెనక దిగబడి పోయాడు.

హెడ్‌క్లార్కు నవ్వు నాపుకుంటూ పలకరించేడు. "ఏమండీ! సుబ్బారావు గారూ! కులాసానా ?"

సుబ్బారావుకి చికాకు కలిగింది.

వాళ్ళందరూ ఎందుకు అంత 'గుంపు చింపులు' పడతారు ?

తనేం చేశాడని ?

ఆఫీసరు ఏ 'మూడ్'లో వున్నాడో?

అగ్నిహోత్రుడివలె ప్రజ్వరిల్లుతున్నాడా?! భగవాన్...ఊపిరి ఆగే

ట్టుంది సుబ్రావ్ ? ఏ సంగతీ తనకి చెప్పి పుణ్యం కట్టుకునేందుకు ప్యూను పూర్ణానందమూ లేడు.

'కానున్నది కాక మానదు' అనుకుని గుండెలు చేతబట్టుకుని ఆఫీసరు రూము ప్రవేశించాడు సుబ్బారావు.

*  *  *

మునిరత్నమూ మాధవరావూ మేనేజరు టేబుల్ దగ్గిరకు వచ్చారు.

''సార్ ! బాగా పనిలో వున్నారా ?" _మునిరత్నం.

''అంతగా ఏపనీ లేదు, కూర్చోండయ్యా !"

"సుబ్బారావుని చూశారా ?''

''అహా(.''

''మనిషి బాగా తీసిపోయాడు. ఇదివరకటి వుత్సాహం లేదు.''

''అవును.''

''అతనికి తెలీకపోతే పోయింది. మీరయినా చెప్పివుండవలసింది సార్ !''

"ఏది చెప్పటానికయినా అతను ఎవరితోనయినా సంప్రదించాడా ? ఆ పని అంతా అయిపోయినాకే గదా మనకి తెలిసిందీ ?''

''అవును.''

''ప్చ ! పాపం తొందరపడ్డాడు. ఇంతకీ ఆఫీసరు ఇప్పుడు అతన్ని ఎందుకు పిలిపించా డంటారు ?''

''నాలు గక్షింతలు వెయ్యటానికి.''

"నిజంగా ?''

"అవును; ఆయన సంగతి నాకు బాగా తెలుసు. ఆయనకి ఎనమండుగురు పిల్లలు; ఐదుగురు కొమార్తెలూ, ముగ్గురు కుమాళ్లూ. అయినా ఆయన, 'దిగిరాలేదు' ఆయన విశ్వాసం ఆయనది. అనుభవజ్ఞుడు _ ఇట్లాంటిపన్లు ఆయనకి గిట్టవు. సుబ్బారావుకి గట్టిగానే వడిస్తాడేమో ?''

''ఇప్పుడు సుబ్బారావుకి ఎంతమంది పిల్లలు ?"

చెవులు రిక్కిస్తూ రాజారావూ, కనకారావూకూడా వొచ్చారు. పూర్ణానందం, బ్రహ్మానందమూకూడా ఆ సంభాషణని శ్రద్ధగా వింటున్నారు.

''సుబ్బారావుకా ? ఇద్దరు ఆడపిల్లలు; నెల క్రితమే మళ్ళీ పుట్టింటికి పంపించాడు. ఆవిడకికూడా తెలుసో లేదో ? అవిణ్ణటు పంపి, కంగారుగా ఆ పని చేశాడు, కొంప మునిగినట్టు. అంత మాత్రానికే అంత ఇదయితే ఎట్లాగయ్యా! మన మందరమూ లేమూ ? ఆ మాత్రం తెలియకేనా ?''

''అవునవును;" అందరూ తలలు ఆడించారు.

ఆఫీసరుగారి గది తలుపు తెరుచుకుంది.

తలవంచుకుని సుబ్బారావు బయటికి వచ్చాడు.

'నేను చెప్పలా ? అంతపనీ జరిగింది' అన్నట్టు తలాడించాడు మేనేజరు.

అందరూ ఎవరి సీట్లలోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

*   *   *

"సార్! ఎఫ్-84 తీసుకురమ్మన్నారు ఆఫీసరుగారు - మీ దగ్గర వుందట గదా?" ఎదురుగా నిలబడివున్న సుబ్బారావుని తలెత్తి చూశాడు మేనేజరు.

"నన్ను తీసుకురమ్మన్నాడా? నీకివ్వనా?"

"నాకే ఇవ్వండి."

ఆ ఫైలు లోపల్నించి తీసి ఇస్తూ 'పక్కా' మన్నాడు? అంత సేపు వున్నావు; ఏం జరిగింది?" అంటూ కుతూహలంగా అడిగాడు మేనేజరు.

"ఏమీ లేదు సార్! ఇప్పుడు వొక అర్జంటు స్టేటుమెంటు తయారు చెయ్యాలట. ముందుగా చెప్పకుండా వారం రోజులు సెలవు పెట్టినందుకు కేకలు వేశారు."

"ఇంతకీ నీ 'లీవు' శాంక్షనయిందా?"

"ఏమో! ఏం చేస్తాడో తెలీదు."

"అదేమిటి స్పష్టంగా జీ. వో. వుంటేను?!"

"అవు ననుకోండి; కాని ఆఫీసరుకి ఇష్టంలేకపోతే ఏదో వొంకపెట్టి దానికి మెలిక తిప్పొచ్చుగా?"

"అదీ, నిజమే."

సుబ్బారావు ఫైలు తీసుకుని తిరిగి ఆఫీసరు గదిలోనికి వెళ్ళిపోయాడు.

పావుగంట తరువాత బయటికివచ్చిన సుబ్బరావు, చేతిలో 'ఆఫీసరు' స్వయంగా రాసిఇచ్చిన ఆర్డరుతోపాటు, ఒక స్టేట్మెంటు చేత్తో పట్టుకుని, ఆఫీసులో ప్రతి మనిషిదగ్గరకూ వెళ్ళి కూర్చుని, ఆ స్టేట్మెంటు పూర్తిచేశాడు. అందరిసంతకాలూ వివరాల కెదురుగా తీసుకున్నాడు.


మొదట కొంచము ఆశ్చర్యపడినా, ఆఫీసరుగారి 'హుకుం' అవటంచేత మేనేజరుకికూడా వివరాలు ఇచ్చి సంతకం పెట్టక తప్పలేదు.

సుబ్బారావు, తను సేకరించిన ఆ వివరాలు మధ్యాహ్నం వొంటిగంటకి ఆఫీసరుకి అందజేశాడు. ఆ వివరాలు ఇచ్చి అందరూ చేతులు కొరుక్కున్నారు.

ఆ తరువాత మూడున్నరవరకూ మేనేజరునుంచి, ప్యూను పూర్ణానందం వరకూ వొకొక్కొక్కరికీ పిలుపులు వచ్చాయి. లోపల్నుంచి వచ్చిన ప్రతివొక్కరూ తేలు కుట్టిం దొంగల్లాగా, వొక్కమాటకూడా లేకుండా వెళ్ళి తమతమ సీట్లలో కూర్చున్నారు.

ఎవరికి వాళ్ళు లోలోపలే ఆవిషయాన్నిగురించి మధనపడసాగారు. ఆఫీసరు చెప్పిన ఆ విషయాన్నిగురించే వాళ్ళ ఆలోచనలు సాగాయి, నాలుగువరకూ. తర్జనభర్జనలు జరిగాయి.

"ఏమయ్యా! మీరు ఏమి నిర్ణయించుకున్నారు?" నాలుగూపదికి తన ఆలోచన్ల నుంచి బయటపడి అందర్నీ అడిగాడు మేనేజరు.




మునిరత్నమూ, మాధవరావూ తో సహా అందరూ, 'సరే' నంటామని ఏకకంఠంతో సమాధానం చెప్పారు.

తను చెప్పినట్టుగా, నాలుగున్నరకి అఫీసరుగారు బయటికి వచ్చారు.

అందరూ ఆయన ఎదుట పోగై వినయవిధేయతలతో నిలబడ్డారు.

ఆఫీసరుగారు ఏదో చెప్పబోయేంతలో 'టెలిగ్రామ్ సార్' అంటూ పోస్టుమాన్ వచ్చాడు. పూర్ణానందం వెళ్ళి అది తీసుకువచ్చి సుబ్బారావుకి ఇవ్వబోయాడు.

"అదిట్లా ఇవ్వు సుబ్బారావ్! నువ్వెళ్ళి సంతకం పెట్టిరా." అని పురమాయించి టెలిగ్రాం అందుకున్నారు ఆఫీసరు. అది మడిచి జేబులో పెట్టుకుని_

"జంటిల్ మెన్! నేను ఇందాక మీతో చెప్పినవిషయంగురించి బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చివుంటారు. ఇందాక నా దగ్గరకు వచ్చిన ఆ స్టేట్ మెంటుని చూస్తే మనలో ముగ్గురుపిల్లలకి తక్కువ వున్నమనిషి లేడు. అందర్లోకీ ఎక్కువ వున్నవాణ్ణి నేను. నేను ఆవిషయం గుర్తించేసరికే ఆలస్యమయిపోయింది ఇంతకీ అన్నీ సరిగా ఆలోచించుకుని మీ నిర్ణయం చెప్పండి. నేను ఇందాక చెప్పిన సంగతులు గుర్తున్నాయిగదా!"

"మీఇష్టమే మా ఇష్టంసార్!" మునిరత్నంతోసహా అందరూ ఏకకంఠంతో అరిచారు.

"ఇందాక నేను వూరికే ఆ విషయం గురించి, మీరందరూ సీరియస్‌గా ఆలోచించాలనే అట్లా అన్నాను. ఇందులో బలవంతం ఏమీలేదు. మనస్ఫూర్తిగా ఇష్టపడితేనే సరే అనండి. నా సలహాకి ఒప్పుకోకపోయినా, ఇంక్రిమెంట్స్ నిలుపుచేయటము వుండదు. నేను ఇందాక బెదిరించింది నిజంగా అట్లా చేద్దామని కాదు. చూస్తూనే వున్నారుగదా! నేను అనుభవంమీద చెబుతున్నాను. మనప్రభుత్వము ఎంతో కష్టపడి అందులోని కష్టనష్టాలు ప్రజలకి తెలపటానికి ప్రయత్నిస్తూంది. మీరు చేసే ఈ చిన్నపని

మీకూ, సంఘానికీ, దేశానికీ లాభ దాయకం. ధైర్యం చేసినందుకు నిజంగా సుబ్బారావుని నేను అభినందిస్తున్నాను. ఏమంటారు? మీ నిర్ణయ మేమిటి?—"

"మే మందరం సిద్ధమేసార్! మాకు తండ్రిలాంటివారు మీరు. ఆలోచించి చూస్తే మా మూఢనమ్మకాలు ఎంత పిచ్చివో తెలిసివచ్చింది—" మునిరత్నం అన్నాడు. అందరూ తల లూపారు.

"సరే. రేపే 'మొబయిల్ ఫామిలీ ప్లానింగ్ యూనిట్'కి రాస్తాను. సుబ్బారావ్! నిన్ను అభినందిస్తున్నానోయ్! నిజంగా నీ సెలవు త్తరమే నన్ను ఇంతగా ఆలోచించేట్టు చేసింది. ఇవాళ మనమందరమూ ఒక మంచిపని చేయడానికి నిర్ణయించుకున్నాము. నాకు సంతోషంగా ఉంది. మీ రందరూ ఖచ్చితంగా వొప్పుకున్నందుకు.

అందుకోసం ఇవాళ మీ అందరికీ చిన్న 'టీపార్టీ' ఇస్తాను. ఇప్పుడు మీ రంతా మా ఇంటికి రండి. పార్టీ ఏర్పాటు చెయ్యమని మధ్యాహ్నమే ఇంటికి కబురుచేశాను.

అన్నట్టు, సుబ్బరావ్! నీకు వచ్చిన టెలిగ్రాం బహుశా ఆ విషయంగురించే అయివుంటుంది. నీకు ఇప్పుడు ఇద్దరమ్మాయిలుకదూ?"

తల వూపాడు అవునన్నట్టుగా.

"మళ్ళీ అమ్మాయే అనుకో. అప్పుడు నువ్వు విచారిస్తావా ఆపరేషన్ చేయించుకున్నందుకు?" — నవ్వాడు ఆఫీసరు.

"లేదండీ! ఎంత మాత్రం విచారించను. అవన్నీ ఆలోచించే నేను ఆ నిర్ణయానికి వచ్చాను. ముగ్గురు కంటె ఎక్కువమందిని భరించటం నా శక్తికి మించినపని. రోజురోజుకీమారుతూవున్న ఈ పరిస్థితుల్లో అంతకంటే ఎక్కువ మంది అయితే నాలాంటివాడు ఉక్కిరి బిక్కిరి అయిపోతాడు. ఎవరయినా నాకు ఒకటే," — అన్నాడు సుబ్బారావు.

ఆఫీసరు నవ్వారు.

"గుడ్! అలాటి నిర్ణయమే నేను అందరిదగ్గిర్నించీ ఆశించింది," అంటూ టెలిగ్రాం చించి చదివారు ఆఫీసర్.

"లలితా డెలివర్డ్ — సేఫ్," అని వుంది. ఆ టెలిగ్రాములో — సుబ్బారావు మామగారు గుంటూరునుంచి ఇచ్చారు అది. సుబ్బారావు మొహం ఒక్కసారి వెలిగింది!

సుబ్బారావుని అభినందించి, ఆఫీసరు గారు కారుమీద ఇంటికి వెళ్ళారు. కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ అందరూ ఆయన ఇంటిదిక్కుగా నడిచారు. అందరి మనస్సుల్లోనూ ఒక రకమయిన తృప్తి ఆవరించివున్నది. ఒక మంచిపని చేస్తున్నామన్న ఆలోచన వాళ్ళందరికీ సంతోషం కలిగించింది.

సుబ్బారావు అందరిముందూ గాలిలో అడుగులు వేస్తున్నాడు.